ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కుంటుబడుతున్న ఉపాధి హామీ లక్ష్యం

- కూలీలకు పేరుకుపోతున్న బకాయిలు
- ఐదు గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేని వైనం

ప్రజాశక్తి - తెనాలి



నేలపాడులో కాలువలు తీస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి కోసం పేదల వలసలు నివారించేందుకు వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం లక్ష్యం కుంటుపడుతోంది. పూర్తిస్థాయిలో కనీసం వంద రోజులు పని కల్పించలేకపోతున్నారు. పని కల్పించినా నెలల తరబడి కూలి చెల్లింపులు నిలిచిపోతున్నాయి. దీంతో ఉపాధి కూలీలలో నిస్తేజం తాండవిస్తోంది. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలు నెలల తరబడి వేతనాల కోసం పడిగాపులు కాయటం వారికి కష్టసాధ్యంగా మారింది.

పేదలకు ఉపాధి కల్పించి వారి జీవన విధానాలను మెరుగుపరిచేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని వామపక్షాల కారణంగా యుపిఎ-1 ప్రభుత్వం ప్రవేశపెట్టింది. చట్టం అమలులో భాగంగా ఈ ఏడాది కనీస వేతనం రూ.307 చెల్లించేందుకు నిర్ణయించింది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిన 2లో



పొగాకును పరిశీలిస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నాయకులు

సగానికి పడిపోయిన పొగాకు ధర

- క్వింటాళ్ రూ.18 వేలకు ప్రభుత్వమే కొనాలి
- అన్ని పంటలనూ మద్దతు ధరలకు కొనాలి
- రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్

2లో

సత్తెనపల్లిలో ర్యాలీ



2లో

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని హోరెత్తిన నిరసన ర్యాలీలు

బాలికైన మేనకోడలిపై లైంగిక దాడి

ఆమె చెల్లిలపైనా లైంగిక దాడికి యత్నించగా స్థానికుల దేహశుద్ధి - 2 లో





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రస్తుత డిజైన్‌తో ఇక్కట్లు తప్పవు

- శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ డిజైన్ మార్చాలి
- జెఎసి సవరణలకు రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు
- ముందుగానే ఆర్‌యుబి నిర్మించాలన్న పార్టీలు, సంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే వందేళ్లకు ప్రజల ట్రాఫిక్ అవసరాలు తీర్చే విధంగా శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ నిర్మించాలని రాజకీయ పార్టీలు ముక్త కంఠంతో డిమాండ్ చేశాయి. బెటర్ శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ సాధన జెఎసి ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని ఓ హోటల్లో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వైసిపి, కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి పార్టీల నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత డిజైన్‌కు జెఎసి చేస్తున్న సవరణలకు సంపూర్ణ మద్దతు తెలిపాయి. జెఎసి నాయకులు ఎల్.ఎస్.భారవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెఎసి నాయకులు పి.వి.మల్లికార్జునరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రస్తుత డిజైన్, దానివల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. భారవి మాట్లాడుతూ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జెఎసి వ్యతిరేకం కాదని, జెఎసిపై కొందరు తప్పుడు ప్రచారం చేయటంలో అర్థం లేదని అన్నారు. తమకు ప్రజల ప్రయోజనాలు ముఖ్యమన్నారు. సింగిల్ పిల్లర్ ఐకానిక్ బ్రిడ్జిని హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ నిర్మించాలని, ముందుగానే ఆర్‌యుబి నిర్మించాలని కోరారు. వైసిపి నగర అధ్యక్షులు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు నర్రా శ్రీనివాసరావు, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వివికె.సురేష్, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు నారాయణరెడ్డి, వల్లూరు సదాశివరావు, ఆటో యూనియన్ నాయకులు మురళి, షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు ముత్యాలరావు, ఎఐటియుసి హనుమంతరావు నాయకులు మద్దతు తెలిపారు.

వందేళ్ల అవసరాలు తీర్చాలి..

కెఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ.

ఇప్పుడున్న బ్రిడ్జి నిర్మించి దాదాపు 70 ఏళ్లయ్యింది. నూతనంగా నిర్మించే బ్రిడ్జి మరో వందేళ్లపాటు ప్రజలు, ట్రాఫిక్ అవసరాలు తీర్చాలి. కానీ అందుకు భిన్నంగా పొడవు కుదించటం, అండర్‌బ్రిడ్జి నిర్మించకపోవటం సరికాదు. ఫ్లై ఓబర్ కంటే ముందుగానే ఆర్‌యుబి నిర్మించాలి. ప్రస్తుతం మంజూరురైన రూ.98 కోట్లు సరిపోవు. అదనపు నిధులు కేటాయించాలి. త్వరలో ఆర్‌అండ్‌బి మంత్రిని, లోకేష్‌ను కలిసి సమస్యను వివరిస్తాం.

తర్వాత సరిదిద్దే అవకాశం ఉండదు

మస్తాన్‌వలి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ



రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జిని చరిత్రలో గుర్తుండిపోయేలా నిర్మించాలన్నదే తమ అభిప్రాయం. తప్పు జరిగితే మళ్లీ సరిదిద్దుకునే అవకాశం ఉండదు. రెండు, మూడేళ్లపాటు నిర్మాణం జరిగే శంకర్ విలాస్ బ్రిడ్జికి ఆర్‌యుబి లేకపోతే ప్రజలు ఇబ్బంది పడతారు.

ఇది ప్రజలందరి సమస్య

రామకృష్ణ, బిజెపి నాయకులు



శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సమస్య రాజకీయ పార్టీలు, నాయకుల సమస్య కాదు. నగరంలోని ప్రజలందరి సమస్య. కావున మంచి బ్రిడ్జి కోసం అందరం కలిసి కృషి చేద్దాం. అదనపు నిధుల కోసం ప్రభుత్వాలను అడుగుదాం.

సర్వీసు రోడ్లు ఇరుకుగా ఉన్నాయి

పి.వి.మల్లికార్జునరావు, జెఎసి నాయకులు



ప్రస్తుత డిజైన్‌లో సర్వీసు రోడ్లు చాలా ఇరుకుగా ఉన్నాయి. డబుల్ పిల్లర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల జిజిహెచ్, బ్రాడీపేట 4 లైన్ వద్ద ఎర్త్‌వాల్స్‌తో కానాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటివల్ల ఉపయోగం ఉండదు. సింగిల్ పిల్లర్ విధానంలో నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు ఉండవు.

పౌరసంఘాలతో చర్చించాలి

బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు

ప్రభుత్వం డిజైన్‌ను చాలా కాలంపాటు గోప్యంగా ఉంచింది. జెఎసి చేస్తున్న సవరణలు సహేతుకంగా ఉన్నాయి. కావున జెఎసి నాయకులు, పౌర సంఘాలతో ప్రభుత్వం, అధికారులు చర్చించాలి.

పాత డిజైన్ ప్రకారం నిర్మించాలి

అంబటి రాంబాబు, మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు.

ప్రభుత్వం ఆమోదించిన శంకర్ విలాస్ రైల్వే ఫ్లై ఓవర్ డిజైన్‌తో నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరకపోగా మరింత పెరిగే అవకాశం ఉంది. పొడవు కుదించటం, ఆర్‌యుబిలు లేకపోవటం, సర్వీసు రోడ్లు తగిన వెడల్పు లేకపోవటం వంటి సమస్యల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఇంకా పెరిగాయి. గతంలో టిడిపి ప్రభుత్వంలో ఎంపి గల్లా జయదేవ్ హయాంలో రూపొందించిన డిజైన్ ప్రకారమే హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ సింగిల్ పిల్లర్ ఫ్లైఓవర్ నిర్మించాలి. బడ్జెట్ పరిమితులు విధించుకొని నిర్మిస్తే తర్వాత ప్రజలు ఇబ్బంది పడతారు. కేంద్రం ఇస్తున్న నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి సమగ్రమైన ఫ్లై ఓవర్ నిర్మించాలి. ఎంపిలు, ఎమ్మెల్యేలు పంతానికి పోకుండా ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని డిజైన్ మార్చాలి.

విజన్ లేని ఫ్లైవోవర్ డిజైన్

కె.నళినీకాంత్, సిపిఎం నగర కార్యదర్శి



విజనరీ లీడర్ నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వం అని చెప్పుకుంటూ గుంటూరులో శంకర్ విలాస్ బ్రిడ్జిని మాత్రం విజన్ లేకుండా నిర్మించటం సరికాదు. ప్రస్తుత ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆరు లైన్ల బ్రిడ్జి స్థానంలో నాలుగు లైన్ల బ్రిడ్జి నిర్మిస్తున్నారు. అలాంటప్పుడు ఆర్‌యుబి రద్దీ తగ్గుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి పాత డిజైన్ ప్రకారం నిర్మించాలి.

బెటర్ ఫ్లై ఓవర్ కోసం కృషి చేద్దాం..

కె.మాల్యాద్రి, సిపిఐ నగర కార్యదర్శి.



రాబోయే తరాల కోసం బెటర్ బ్రిడ్జి సాధన కోసం కలిసి కృషి చేద్దాం. ఇటీవల మూడు వంతెనెలు మూసివేస్తే ట్రాఫిక్ సమస్యలను ప్రజల ప్రత్యక్షంగా చూశారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఆ స్థాయిలో ట్రాఫిక్‌ను తట్టుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. కావున ముందుగా ఆర్‌యుబి నిర్మించాలి.

నేడు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి - గుంటూరు

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెల 3వ శనివారం నిర్వహించు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9గంటలకు కలెక్టరేట్ నుండి శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు ర్యాలీ జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఫోటో ఎగ్జిబిషన్, స్టాల్స్ ప్రదర్శన, ఈ-వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రెటరి కె.విజయానంద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, జిల్లా కలెక్టర్ కె.నాగలక్ష్మి, ఎంఎల్సీలు, ఎంఎల్ఏలు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటార న్నారు. నగర ప్రజలు కూడా తమ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శనివారం విజ్ఞానమందిరంలో ఏర్పాటు చేసే ప్రత్యేక స్టాల్స్‌లో అందించి తగిన రశీదు పొందాలని కోరారు.

కుంటుబడుతున్న ఉపాధి హామీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో కూలీలకు వ్యవసాయ పనులు పెద్దగా ఉండడం లేదని, అందుకే ఈ చట్టం కింద ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలని పలు ప్రజా సంఘాలు ఆందోళనలు చేసినప్పటికీ 100 రోజులకు మించి పని కల్పించలేని పరిస్థితులు ఉన్నాయి. ఎక్కువశాతం కార్డులకు 65-70 రోజుల పని కల్పనే గగనమవుతోంది. గ్రామసభల ద్వారా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించాల్సి ఉంది. ఆయా పనులు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన కూలీలకు జాబ్ కార్డులు అందించి, పని కల్పించాలని కోరిన వారికి పని కల్పించాలి. ప్రతి మూడు రోజులకు వారికి కూలి చెల్లించాలి. ఖరీఫ్, రబీ సీజన్లో వివిధ పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఏ పని ఉండదు. ఆ సమయంలో చేపట్టే ఉపాధి పనులలో పంట కాల్వలు, మురుగు కాల్వలు పూడికతీత, సిసి రోడ్ల నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్, నూరు శాతం సబ్సిడీపై తైవాన్ జామ మొక్కలు పంపిణీ వంటి పనులు చేపడతారు. ప్రస్తుతం తెనాలి మండలంలో ఉపాధి కూలీలకు 10 వేలకు పైగా జాబ్ కార్డులు అందించారు. ఈనెల మొదటి వారంలో అంతంత మాత్రంగా పనులు ప్రారంభమైనా, రెండో వారం నుంచి ఊపందుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దాదాపు జూన్ నెలాఖరు వరకు ఉపాధి కూలీలకు పని కల్పించనున్నన్నారు.

జనవరి నుంచి వేతనాలు పెండింగ్

గ్రామీణ ప్రాంతాలలో రెక్కాడితే కాని డొక్కాడని కూలీలే ఉపాధి హామీ పథకంలో పనిచేస్తుంటారు. వీరు ఏ పనికి వెళ్లినా సాయంత్రానికి కూలి తెచ్చుకోవాల్సిందే. అయితే ఉపాధి హామీ పథకంలో నిబంధనల ప్రకారం ప్రతి మూడు రోజులకు చెల్లింపులు ఉంటాయి. కానీ ఈ ఏడాది జనవరి 26 నుంచి ఇప్పటి వరకు కూలీలకు చెల్లింపులే లేవు. దీంతో ఉపాధి కూలీలు తీవ్ర నిరాశలో ఉన్నారు.

ఐదు గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లే లేరు

పనుల కల్పనలో, పర్యవేక్షణలో గ్రామస్థాయిలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్లు కొలకలూరు, కంచర్లపాలెం, గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాలకు లేరు. సిబ్బందే ఆయా గ్రామాలకు ఇన్‌ఛార్జి ఫీల్డ్ అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా కొలకలూరు గ్రామం నియోజకవర్గంలోనే పెద్దది. గ్రామంలో సమస్యలు ఎక్కువే. జాబ్ కార్డులు కూడా ఈ గ్రామంలోనే అత్యధికంగా అంటే దాదాపు 2వేలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో అలసత్వానికి కారణాలు ఏమిటన్నది ప్రశ్నార్థకం.

నిధులు విడుదలవగానే కూలి చెల్లింపులు

ఆనందమోహన్, ఏపీవో, తెనాలి.

వాస్తవానికి ఉపాధి కూలీలకు ప్రతి మూడు రోజులకు చెల్లింపులు చేస్తుంటాం. కానీ ఈ ఏడాది జనవరి 26 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. నిధులు విడుదలైన వెంటనే కూలీలకు చెల్లిస్తాం. అంగలకుదురు, కొలకలూరు, కంచర్లపాలెం, గుడివాడ, కోపల్లె గ్రామాలకు నియామకం జరగాల్సి ఉంది. అయితే అంగలకుదురు, గుడివాడ, కోపల్లె గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్స్ నియామకం చివరి దశలో ఉంది.

వక్ఫ్ సవరణ చటాన్ని రద్దు చేయాలని ..

హోరెత్తిన నిరసన ర్యాలీలు


అమరావతిలో

ప్రజాశక్తి - అమరావతి

ముస్లిమ్ జెసి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మలు సెంటర్ నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు ర్యాలీ చేశారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మసీదు సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభలో ఆవాజ్ రాష్ట్ర నాయకులు షేక్ బాషా మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారి అడుగులకు మడుగులొత్తిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి అయిన మోడీ ప్రభుత్వం ముస్లిములకు హక్కులను లేకుండా కుట్రలు చేస్తోందని విమర్శించారు. వక్ఫ్ బోర్డు పేదలకు సేవా కార్యక్రమాలు చేయడానికి ఆస్తులు కలిగినటువంటి ఒక స్వతంత్ర సంస్థని తెలిపారు. దేశంలో ఉన్నటువంటి రైల్వేలు ఓడరేవులు విమానా శ్రయాలు కార్పొరేట్ అధిపతులకు దోచిపెడుతున్న టువంటి మోడీ ప్రభుత్వం ముస్లింల సంక్షేమను కున్నటువంటి వక్ఫ్ బోర్డు ఆస్తులను కొల్లగొట్టే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఎన్ఆర్‌సి, సిఏఏ వ్యతిరేక పోరాటం తరహాలో దేశభక్తులు ప్రజాస్వామ్యవాదులు అభ్యుదయ వాదులందరినీ కలుపుకొని ఐక్యంగా మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రవిబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వాములై ప్రాణాలు అర్పించినటువంటి ముస్లిం సమాజాన్ని దేశద్రోహులుగా ముద్ర వేసే కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మత విషయాల్లో ప్రభుత్వాలు జోక్యం చేసు కోకూడదని రాజ్యాంగం చెబుతున్నప్పటికీ రాజ్యాంగ విరుద్ధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. భారత రాజ్యాంగంలో మౌలిక మైనటువంటి లౌకిక వాదాన్నికి ప్రమాదాన్ని తీసుకొస్తున్నారని ఆయన విమర్శించారు. భారతదేశాన్ని మత ప్రాతిపదిక మీద చిలికి తీసుకొచ్చి తన రాజకీయ అధికారాన్ని కాపాడుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారని మోడీ బాధితులుగా ఉన్నటువంటి రైతులు కార్మికులు శ్రమజీవులు అంబేద్కర్ అభ్యుదయవాదులు ప్రజాస్వామ్యవాదులు అందరం కలిసి ఐక్య ఉద్యమాలు


పెదకూరపాడులో

చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సిపిఎం అమరావతి కార్యదర్శి బి సూరిబాబు మాట్లాడుతూ చట్ట సవరణ రద్దు చేసే వరకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు గంటా గోపి ముస్లిం మత పెద్దలు షేక్ జానీ, హష్మి, ముఫ్తీ ముజాహిద్లా, ముక్తి రహమతుల్లా, హఫీజ్ అబ్దుల్ గఫార్, మౌలానా అబ్దుల్ మస్తాన్ తదితరులు మాట్లాడగా ఆవాజ్ నాయకులు భాష, సయ్యద్ మోహిద్దీన్ ముస్లిం పెద్దలు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పల్నాడు జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం ముస్లిములు భారీ శాంతి ర్యాలీలు చేపట్టారు. మతాల మధ్య చిచ్చు పెట్టొద్దని, హిందూ ముస్లిమ్ భాయిభాయి అని నినాదాలు చేశారు. వక్ఫ్ బోర్డు చట్టం సవరణ బిల్లు పై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలోని మాచర్ల రోడ్డు చెక్ పోస్ట్ మజీద్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ అనంతరం తాలూకా సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సభలో నాయకులు మాట్లాడుతూ ముస్లిముల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసుకున్న బోర్డు కమిటీలో ముస్లిమేతరులను చేరుస్తూ చట్ట సవరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వక్ఫ్ బోర్డు భూములు, మదర్సాలు, మసీదులు, ఖబరస్తాన్‌లు, పీర్ల మాన్యాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు కోరడం, ప్రతి జిల్లా కలెక్టర్‌ను వక్ఫ్ బోర్డులో సమస్యలపై సుపీరియర్ అధికారం ఉండడం సరికాదన్నారు. దశాబ్ద కాలంగా ముస్లిములపై రాజకీయ అరాచకాలు ఎక్కువయ్యాయని, ప్రతిదానికీ ఆంక్షలను ప్రభుత్వాలు విధిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ర్యాలీకి న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్.కె ముక్తి అష్రఫ్, షేక్ అబ్దుల్ అజీమ్, ఎంజె మౌలాలి, సయ్యద్ పెద్ద కరిముల్లా, సయ్యద్ మస్తాన్‌వలి, షేక్ సలీం, ఎస్‌కె రాంబోబు బుడే, ఎస్‌కె సాదిక్, ఎస్‌కె ఇంజనీర్ గౌస్, ఎస్‌కె దూద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నకరికల్లు మండలంలోని ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ బిజెపి పార్లమెంటులో నల్ల చట్టాలను ప్రవేశపెట్టి రాజకీయ స్వలాభం కోసం మతాల మధ్య చిచ్చు పెడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఓటు అనే ఆయుధంతో ముస్లింలు బిజెపితోపాటు మద్దతు ఇచ్చిన పార్టీలకు బుద్ధి చెప్తారని అన్నారు. శాంతి నిరసన ర్యాలీ బంగ్లా గడ్డ నుండి పాతూరు వరకు అనంతరం వై జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగూర్ ,అడ్వకేట్ షేక్ రజాక్, బీజాపూర్ జాను, డాక్టర్ బుడే, కరాలపాటి వలి, షేక్ సలీల్, ముస్లిం భారీగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బస్టాండ్ వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అంతజేశారు. జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షులు పఠాన్ కాసింఖాన్, ముస్తఫా పాల్గొన్నారు.

బాలికైన మేనకోడలిపై లైంగిక దాడి

ఆమె చెల్లిలపైనా లైంగిక దాడికి యత్నించగా స్థానికుల దేహశుద్ధి

ప్రజాశక్తి- తాడేపల్లి : కన్నబిడ్డలా చూడాల్సిన మేనమామే కాలయముడై కాటు వేసిన ఘటన తాడేపల్లి పట్టణంలోని అంజిరెడ్డి కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. భర్త నుండి విడిపోయిన మహిళ అంజిరెడ్డి కాలనీలో తన ఇద్దరు బిడ్డలతో కలిసి సోదరుని ఇంట్లో ఉంటోంది. మద్యం అలవాటున్న మహిళ తన బిడ్డలను జాగ్రత్తగా చూసుకోవడంలో ఏమరపాటు కారణంగా ఆ పిల్లలపై మేనమామ కన్నుపడింది. ఆమె ఇద్దరు కుమార్తెల్లో పదేళ్ల పెద్ద కుమార్తెపై కొన్ని నెలలుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. మూడ్రోజుల క్రితం చిన్న కుమార్తె అయిన తొమ్మిదేళ్ల బాలికపైనా లైంగిక దాడికి యత్నించగా బాలిక భయపడి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోగై అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలికను వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని సిఐ బి.కల్యాణ్ తెలిపారు. దుండగుడి లైంగిక దాడిని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్‌కుమారి, తాడేపల్లి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి.విజయలక్ష్మి, ఎస్.గిరిజ తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాన్ని వారు శుక్రవారం పరామర్శించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

సగానికి పడిపోయిన పొగాకు ధర

- క్వింటాళ్ రూ.18 వేలకు ప్రభుత్వమే కొనాలి
- అన్ని పంటలనూ మద్దతు ధరలకు కొనాలి
- రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు


పొగాకును పరిశీలిస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నాయకులు

పొగాకు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలురైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మండలంలోని పొగాకు రైతులను ఆయా సంఘాల నాయకులు శుక్రవారం పరామర్శించారు. పొగాకును పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతుసంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. దేశంలో 65 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం తగదన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల సహకార సంఘాలు దెబ్బతిని రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమూ బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని, ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. కనీసం రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జోక్యం లేకపోవడం వల్ల పొగాకు, మిర్చి, ధరలు తీవ్రంగా పతనమవుతున్నాయని తెలిపారు. గతేడాది రూ.15-18 వేల ధర ఉండగా ప్రస్తుతం రూ.ఏడెనిమిది వేలకు పడిపోయిందని, మిర్చి ధర కూడా రూ.20 వేల నుండి రూ.తొమ్మిది పదివేలకు పడిపోయిందని తెలి పారు. పంటలకు సరైన ధర కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరారు. ధాన్యం, శనగ, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా వారి పంటలను కొనుగోలు చేయాలని, రైతు పథకాలను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, రైతు సంఘం గుంటూరు జిల్లా నాయకులు కె.వెంకటశివరావు, డి.రమేష్‌బాబు, జె.రామారావు, కె.వెంకట సుబ్బారావు, పి.సుధీర్, బి.శంకరయ్య, పి.శేషగిరిరావు, కె.చంద్రారావు, టి.గాబ్రియేల్, జి.సుబ్బారావు, కె.నాగేశ్వరరావు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

రోడ్‌షో ప్రదేశాన్ని పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపం అమరావతి పరిధిలో మే2 వ తేదీన చేపట్టనున్న వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రధాని నరేంద్ర మోడి పాల్గొంటున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎక్సైజ్ కమిషనర్ నీషాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, ఎంటిఎంసి కమిషనర్ అలీమ్ భాష, ఆర్‌డిఓ కె.శ్రీనివాస రావు పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు, సభా ప్రాంగణం వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లు, వీవీఐపీలు ప్రయా ణించే మార్గాలకు సంబంధించి ప్రాంతాలను పరిశీలించి చేపట్టవలసిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు. భారత ప్రధాని పాల్గొననున్న రోడ్ షో దారిని కలెక్టర్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించి చేపట్టవలసిన బ్యారికేడ్ పనులపై సూచనలు చేశారు. రాష్ట్ర



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

సచివాలయానికి ఎదురుగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులు పరిశీలించి నిబంధనల మేరకు నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజ నీరింగ్ అధికారులకు చెప్పారు. ప్రధాని పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్.ఈ శ్రీనివాస మూర్తి, ఎక్జిక్యూ టివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, గుంటూరు పశ్చిమ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరక్టర్ వందనం, సీఆర్డీఎ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE A.P. CO-OPERATIVE TRIBUNAL AT VIJAYAWADA
O.P. NO. 82/2024

Between :
The Kakateeya Mutually Aided Thrift and Credit Co-Operative Society Limited, Regd. No. AMC/GNT/DCO/2001/532, Rep. by its Authorized Person, Kothapet, Tenali, Guntur Dist. .... Petitioner
AND
Sakhamuri Srinivasa Rao, S/o Vengaiah, D.No. 2-407, Gandhi Nagar, Tenali, Guntur District. Pin - 522201 .... Respondents

పై నెంబరు గల ఓ.పి.లో పిటీషనరు అయినటువంటి సొసైటీ వారు రెస్పాండెంటు అయినటువంటి మీపై రావలసిన బాకీ నిమిత్తం సదరు పై కోర్టులో ఓ.పి. వేసియున్నారు. సదరు శ్రీ కోర్టువారు ఎన్ని సమన్లు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్‌కు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున మీరు ది. 19-5-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన గలరు. లేనిచో పై నెంబరు గల పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

వాయిదా : 19-5-2025

M.Parameswara Rao, Advocate,
D.No. 31-15-11, Katurivari Street,
Machavaram Down,
Vijayawada- 520004.
Cell : 9390606066

Notice
IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION):: SATTENAPALLI
I.A.No.205/2024 ,I.A.No.206/2024 & I.A.No.207/2024 in O.S.No.160/2017

Between:
Shaik Sajid ..... Petitioner/Plaintiff
And
Shaik Bada Ghan Saida (Died) and Others. ... Respondents/ Defendants

To,
R-11: Shaik Rabbani,S/o.Late Bada Ghan Saida,
R-12: Shalk, Suban,W/o. Shaik Jani Basha. D/o. Late Bada Ghan Saida,Both are R/o. Dokkiparu Sivaru. Turakapalem (Vil), Medikonduru(Md), Guntur Dist.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం: 205/2024 సెక్షన్-5, ఐ.ఎ.నెం:206/2024 ఆర్డర్ 22 రూలు 17, ఆర్డర్ 22 రూలు 4 మరియు ఐ.ఎ.నెం. 207/2024 ఆర్డర్ 22 రూలు 9(2) పిటీషనులలో 11&12 రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయమని శ్రీ కోర్టు వారు ది.08-05-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:08-05-2025

సానికొమ్ము సుబ్బారెడ్డి,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్,
గుంటూరు.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ శ్రీయుత ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) సత్తెనపల్లి వారి కోర్టులో
ఇ.పి. 170/2023

బిట్వీన్ :
గంపల వేణుగోపాలరావు .... డిక్రీహోల్డర్
వర్సెస్
కొల్లు చంద్రశేఖర్‌రెడ్డి .... జడ్జిమెంట్ డెట్టార్టు,
కొల్లు చంద్రశేఖర్‌రెడ్డి, తండ్రి : వీరారెడ్డి,
వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్,
డోర్‌నెం. 3-158, 75 తాళ్ళూరు, పెదకూరపాడు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు ఇ.పి.లో జెడిఆర్ (జడ్జిమెంట్ డెట్టార్) కు డిక్రీహోల్డర్ పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ జారీకాని కారణంగా డిక్రీహోల్డర్ దరఖాస్తు మేరకు పై కోర్టువారు బహిరంగ నోటీసుకు అనుమతిస్తూ ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురణకు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో జెడిఆర్‌కు ఈ బహిరంగ నోటీసు పత్రికలో ప్రచురించడమైనది. వాయిదాతేది : 12-5-2025 ఉదయం 10-30 గం.లకు జెడిఆర్ నేరుగా గానీ, వకీలు ద్వారా గానీ శ్రీ కోర్టువారి ముందు హాజరై తన వాదనలు వినిపించుకోవాల్సి వుంది. లేనిచో తన పరోక్షములో శ్రీ కోర్టువారు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచటమైనది.

ఇట్లు
ఉల్లం శేషగిరిరావు,
ఉసిరికాయల సాంబశివరావు,
నర్రా శ్రీనివాసరావు,
డిహెచ్‌ఆర్ తరపు న్యాయవాదులు,
తేది:15-4-2025 **సత్తెనపల్లి.**

Notice
IN THE COURT OF THE 5TH ADDL. DISTRICT JUDGE: GUNTUR
I.A.No.409/2024 in O.S. No 172/2023

Between:
Venigalla Praveen, S/o.Late Siva Rama Krishna Prasad Rep.by his power of attorney holder Kodali Ram Prasad.
...Petitioner/Plaintiff
And
Inabathini Koteswaramma & 14 Others
.... Respondents/Defendants

To,
R-8/D-8: Rajeti Surya Deepak Sidharth,S/o. Venkateswarlu, R/o.Door No. 25-14-45, 10/2, Srinivasaraothota, Guntur City, Guntur.
R-15/D-15: Challagali Rahelamma,W/o. Ananda Balaraju, R/o.Door No. 77-25-1/8, Water tank Road, Santhinagar, Vijayawada, NTR District.

పై నెంబరు దావాలోని ఇంజక్షన్ ఐ.ఎ.409/2024 పిటీషను లో 8 & 15 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకొనకుండా నిరాకరించుచున్నారు. గాన మీ యొక్క నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ది 29/04/2025 తేదికి వాయిదా వేసినారు. గాన ఆ రోజు అనగా ది 29/04/2025 ఉదయం గం 10.30 ని. లకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది.లేని యెడల మీ పరోక్షమందు విచారించి, తీర్మానించదరని మీకు యిందు మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది:29/04/2025

ఇట్లు,
కటకంశెట్టి ఉమామహేశ్వర్
అడ్వకేట్,
GF3, రత్న టవర్స్. 18 /1,
అరండల్ పేట, గుంటూరు,
మొబైల్ నెంబర్: 9440632721

IN THE COURT OF HON'BLE V-ADDL. DIST. JUDGE COURT, GUNTUR
I.A.No.663/2013 in O.S. NO. 86 /2023

Between
Smt. Bade Vijaya Kumari
….. Petitioner/Plaintiff
And
Bade Rajya Lakshmamma & Other
. …. Respondents /Defendants

To,
R-1/D-1: Bade Rajya Lakshmamma,W/o. late Bade Anki Reddy, Redla Bazar, Sangadigunta, Guntur Town
R-5/D-5: Veeramreddy Prameela, W/o.V. Malli Kharjuna Rao, D/o. Late Bade Anki Reddy,R/o. Door No. 27-72, Kothapet,Vinukonda, Guntur District.
R-6/D-6: Bade Rama Devi,W/o. Bade Subbreddy, D/o. late Bade Anki Reddy, R/o. Door No. 4-7-20, Park Road, Koretipadu, Guntur City.

పై నెంబరు దావాలోని injunction ఐ.ఎ.నెం. 663/2023 పిటీషనులో 1,5 & 6 రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిచినను మీకు ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.09-05-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది.09-05-2025

గుండవరపు పద్మవల్లి,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్,
గుంటూరు.

IN THE COURT OF THE ADDL.SENIOR CIVIL JUDGE: TENALI
O.S.No.46/2021

Between:
వడ్రాణం వీరరాఘవయ్య- ప్లెయింటిఫ్
అండ్
వడ్రాణం పకీరయ్య (డైడ్) మరియు 5 గురు
- ప్రతివాదులు

D5-సందు విజయలక్ష్మి
D6-గోగిశేటి కుసుమ కుమారి (అడ్రస్సు)
To

పై నెంబరు దావాలోని D5 మరియు D6 ప్రతివాదులు కోర్టువారు పంపిన, నోటీసు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్తా పత్రిక ద్వారా మాకు తెలియ చేయమని కోర్టు నోటీసు ఉత్తర్వులు అయి వున్నవి. ది.22-04-2025 తేదిన కేసు వాయిదా వేసి యున్నారు. సదరు తేదిన ఉదయం 10-30 ని॥లకు పై కోర్టు వారి యెదుట, స్వయముగా గాని తేదా ప్లీడరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది:22-04-2025

కానాదిబొట్ల శ్రీనివాసమూర్తి
కె.వి.ఆర్.ఎస్.లక్ష్మి
న్యాయవాదులు, గుంటూరు.

IN THE COURT OF HON'BLE V-ADDL. DIST. JUDGE COURT, GUNTUR
O.S. NO. 86 /2023

Between
Smt. Bade Vijaya Kumari ….. Plaintiff
And
Bade Rajya Lakshmamma & Other.
…. Defendants

To,
D-1: Bade Rajya Lakshmamma, W/o. late Bade Anki Reddy, Redla Bazar, Sangadigunta, Guntur Town
D-5: Veeramreddy Prameela, W/o.V. Malli Kharjuna Rao, D/o. Late Bade Anki Reddy,R/o. Door No. 27-72, Kothapet,Vinukonda, Guntur District.
D-6: Bade Rama Devi,W/o. Bade Subbreddy, D/o. late Bade Anki Reddy, R/o. Door No. 4-7-20, Park Road, Koretipadu, Guntur City.

పై నెంబరు దావాలో 1,5&6 ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపిచినను మీకు ముట్టనందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.09-05-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది.09-05-2025

గుండవరపు పద్మవల్లి,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.

SUR NAME CHANGE

I, **KODHARI KONDALU** (old sur name) **S/o KODHARI LAKSHMAYYA** R/D. No 11-7-6/30, Navodaya Nagar, Narasaraopet, Palnadu District, AP-522601, my Passport bearing No C1312354. I, have changed my sur name **KODARI KONDALU** (New sur name) Hereafter my sur name is known as **KODARI KONDALU** (New sur name) to our family)

SUR NAME CHANGE

I, **KODHARI RAJESWARI W/o KODHARI KONDALU** (old sur name) R/D.No 11-7-6/30, Navodaya Nagar, Narasaraopet, Palnadu District, AP-522601. I, have changed my sur name as **KODARI RAJESWARI W/o KONDALU** (New sur name) Hereafter my sur name is known as **KODARI RAJESWARI** (New sur name) **W/o KODARI KONDALU.**

జాషువా సమాధివద్ద నివాళి

ప్రజాశక్తి -గుంటూరు



నివాళి అర్పిస్తున్న మాణిక్య వరప్రసాద్

ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని ఆనంద పేటలోని మహాకవి గుర్రం జాషువా సమాధిని శుక్ర వారం మాజీ మంత్రిడొక్కా మాణిక్య వరప్రసాద రావు సందర్శించినివాళులర్పిం చారు. కార్యక్రమంలో మాదిగ జనసేవ సమి తి నాయకులు జోసఫ్ కుమార్, హైకోర్టు అడ్వకేట్ ఎలీషా, సెక్రెటరీ అప్పారావు, దాసరి జాన్ బాబు, సౌపాటి రమేష్, జేమ్స్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు రూ.5లక్షల బీమా

ప్రజాశక్తి దుగ్గిరాల

తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు రూ.5లక్షల బీమాను పార్టీ కల్పిస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని దళితవాడలో ఇంటింటికి తిరిగి కార్యకర్తలకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నక్క చిరంజీవి దాసరి బాబురావు వంశీ నాయుడు శశిధర్ కంచర్ల గోపాల్ ఎం ప్రవీణ్ కే రాము సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసిన కసాయి

ప్రజాశక్తి - క్రోసూరు

భార్య గొంతు కోసిన సంఘటన మండల కేంద్ర మైన క్రోసూరులో శుక్రవారం చోటు చేసు కుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం క్రోసూరు మండలం క్రోసూరు గ్రామానికి చెం దిన చెర్ల మల్లమ్మ సోది చెప్పుకుంటూ జీవనం సాగిస్తోంది. భర్త శ్రీనివాసరావు దిష్టిబొమ్మలు అమ్ముతుంటాడు. కొద్దిరోజులుగా వీరి మధ్య కలహాలు ఉన్నా యి. శుక్రవారం ఉదయం 7:30 గంటల సమయం లో మద్యం సేవించి యధా విధిగా తనతో గొడవ పెట్టుకొని గడ్డం గీక్కునే బ్లేడుతో తన గొంతు కోసాడని బాధితురాలు తెలియజేశారు. స్థానికులు చికిత్స నిమి త్తం సత్తెనపల్లిఏరియా వైద్యశాలకు



చికిత్స పొందుతున్న మల్లమ్మ

ప్రమాదంలో గాయపడిన ముగ్గురు మహిళా కూలీలు

ఆటోను ఢీకొన్న లారీ...తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ:

మిరప పంట పొలాల్లో మిర్చి కోతలకు వెళుతున్న కూలీల ఆటోను పిడుగురాళ్ళ నుండి హైదరాబాద్ వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వెనక నుండి ఢీకొన్న ఘటన మండలం లోని తుమ్మల చెరువు గ్రామ సమీపంలోని టోల్‌గేట్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత మహిళా కూలీలు తెలి పిన వివరాల ప్రకారం తుమ్మల చెరువు గ్రామానికి చెందిన మహిళా కూలీలు సాయంత్రం మిర్చి కోతలకు వెళ్ళేందుకు 30 మంది ఓఆటోలో గ్రామం నుండి బయలు దేరారు. ఆటో తుమ్మల చెరువు టోల్‌గేట్ వద్దకు రాగానే వెనక నుండి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఆటోలో వెనక కూర్చున్న అంజలి, శివమ్మ, జగన్‌కుమారి కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఆటోను లారీ ఢీకొనడంతోనే ముందుకు వెళ్ళిపోయిందనీ, లేదంటే లారీ ఆటోపై నుండి వెళ్ళిపోయి పెను ప్రమాదం జరిగి ఉండేదని తెలియజేశారు. వెంటనే క్షతగాత్రులను పట్టణంలోని ప్రయి వైట్ వైద్యశాలకు తరిలించారు. అయితే సంఘటనపై



గాయపడి చికిత్స పొందుతున్న మహిళా కూలీలు

తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్సై మోహన్ తెలిపారు. కాగా ఇటీ వల ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయనీ, రవాణాశాఖ అధికారులు స్పందించి ప్రమా దాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల పంచాయతీ పరిధిలో పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణ శంకరరావు తెలిపారు. స్వచ్ఛ జీవన్ కార్యక్రమంలో భాగంగా రూ. 56 లక్షల నిధులతో పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.





అన్నమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు బి.మహేష్ తదితరులు

ప్రజాశక్తి మాచర్ల విలేకరి రమేష్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాచర్ల పట్టణానికి చెందిన ప్రజాశక్తి దినపత్రిక సీనియర్ జర్నలిస్టు ఉప్పుతోళ్ళ రమేష్ తల్లి అన్నమ్మ (నాసరమ్మ) (80) గురువారం రాత్రి మరణించారు. భౌతికకాయాన్ని సిపిఎం కార్యదర్శి బి.మహేష్, నాయకులు శోభన్‌కుమార్, వి.వెంకట్రావులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏపియుడబ్ల్యూజె జర్నలిస్టు యూనియన్ నాయకులు విద్యాధరణి మురళి, టి.శ్రీనివాస రావు, టి.సాంబశివరావు, బి.పాపారావు, వి.రామచంద్రారెడ్డి, సుభాని, ఒ.చెన్నకేశవరావు, ఖాసీం, పి.చెన్నకేశవరావు, అక్బర్, చంద్రారెడ్డి, యు.ప్రసాద్, కరిముల్లా, రిటైర్డు ఎంఈవో వి.నాగయ్య, జన విజ్ఞానవేదిక నాయకులు కె.ఆదినారాయణ తదితరులు నివాళులు అర్పించి అన్నమ్మ కుటుంబ సభ్యులను తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని నరసరావుపేట ట్రాఫిక్ సిఐ సిహెచ్ లోకనాథం హెచ్చరించారు. నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ లోకనాథం మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహన ధ్రువీకరణ పత్రాలతో పాటు లైసెన్స్ కూడా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న మైనర్ల వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానాలు విధించామన్నారు.

ఈ-వ్యర్థాలను మాకందివ్వండి : కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల : ఈ-వ్యర్థాలను సక్రమంగా పారవేయక పోవటం వల్ల గాలి, నీరు, భూమికి హాని కలుగుతుందని, అటువంటి వ్యర్థాలను మొబైల్ ఎలక్ట్రానిక్ కలెక్షన్ వెహికల్‌కు అందివ్వాలని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ-వ్యర్థాలు పర్యావరణంలోకి చొరబడి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగించే విషపూరిత పదార్థాలను కలిగి ఉన్నందున ఎలక్ట్రానిక్ వేస్టును సైంటిఫిక్ డిస్పోసల్ చేయటలో భాగంగా శనివారం పట్టణంలోని శ్రీనివాస సినిమా హాల్ నుండి బస్‌స్టాండ్ వరకు ఎలక్ట్రానిక్ వేస్టు కలెక్షన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో పట్టణ ప్రజలు పాల్గొని తమ వద్ద గల పనిచేయని, పనికిరాని కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మానిటర్లు, కీబోర్డులు, మౌస్, ప్రింటర్లు, స్కానర్లు, టెలివిజన్లు, మొబైల్ ఫోన్లు, ఫ్యాక్స్ యంత్రాలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, డివిడి ప్లేయర్లు, బ్యాటరీలు, యూపిఎస్‌లు, వైర్లు, చార్జర్లు, గడియారాలు, గేమ్ ప్లేయర్లు, స్టీరియోలు, కాలిక్యులేటర్లు, పిసిబిలు, మైక్రోవేవ్ ఓవెన్‌లు మొబైల్ ఎలెక్ట్రానిక్ కలెక్షన్ వెహికల్‌కు అందివ్వాలని లేదా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్టు కలెక్టన్ సెంటర్ నందు ఇవ్వాలని కోరారు.





ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న జీవీ ఆంజనేయులు, హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న జీవీ

జాతీయ స్థాయి ఎడ్లపందేలు ప్రారంభం

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని మదమంచిపాడు వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. సీనియర్, జూనియర్, సేద్యపు, 6 పళ్ల సైజు, 4 పళ్ల సైజు, 2 పాల పళ్ల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. సీనియర్ విభాగంలో తొలి 3 స్థానాలకు రూ.1,25,000, రూ.1,00,000, రూ.75,000 చొప్పున బహుమతులను జీవీ ఆంజనేయులు అందించనున్నారు. సీనియర్, 2 పాలపళ్ల విభాగంలో 10 మందికి, మిగిలిన కేటగిరీల్లో 9 మందికి చొప్పున బహుమతులు అందించనున్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులు, కామెంట్రీ హోరు, ప్రేక్షకుల కేరింతలతో ఎడ్లపందేలు సందడిగా సాగుతున్నాయి. ఈ పోటీలకు వచ్చిన రైతులందరికీ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మక్కెన చినరామయ్య పేరు మీద ఆలయం వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు.

బాలిక హాస్టల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఈపూరు

పేదలకు నాణ్యమైన విద్య వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు అన్నారు. మండలంలోని వనికుంట గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహ నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌లో చదివే బాలికల కోసం ప్రభుత్వం రూ.2.26 కోట్లతో వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. కేజీబీవీ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు, కంప్యూటర్ ల్యాబ్‌కు రూ.45 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈపూరు మండలంలో స్థల సేకరణలో జాప్యం వలన స్కూల్ భవన నిర్మాణం నిలిచిపోయిందని, అప్పటి టిడిపి ప్రభుత్వం ఎట్టకేలకు వనికుంటలో స్థలాన్ని కేటాయించి విధులు మంజూరు చేస్తే వైసిపి ఐదేళ్లలో పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయలేదని అన్నారు. ఇదిలా ఉండగా గుండెపల్లి మేజర్‌లో పూడికతీత పనులను జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎస్ఎస్ఎ డిఇఇ ప్రభాకరరావు, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ ఇ.సునీల్, సర్పంచ్ బి.సుబ్బయ్య, డీసీ చైర్మన్ జి.వేణుగోపాలరావు, టిడిపి మండల అధ్యక్షులు టి.బాలయ్య, ఎ.కోటేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

నీరున్నా గొంతెండుతోందని ఆందోళన

ప్రజాశక్తి - క్రోసూరు

వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులున్నా, చెరువులో నీళ్లు పుష్కలంగా ఉన్నా తమ గొంతులు మాత్రం ఎండుతున్నాయని మండలంలోని దొడ్లేరు గ్రామంలో స్థానికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. జలజీవన్ మిషన్ ద్వారా నీరు సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. కనీసం బోరు వేయించుకుందామనుకున్నా పోలీసుల ద్వారా అడ్డుకున్నారని ఆవేదనకు గురయ్యారు. గ్రామంలోని దండుబజారు వాసులు మొన్నటి వరకు అక్కడే ఉన్న బావి నుంచి నీరు తెచ్చుకునేవారు. బావి యజమాని ప్రస్తుతం వారిని రానీయటం లేదు. దీంతో వీధిలో బోరు పంపు వేసేందుకు గురువారం ఉపక్రమించారు. 20 అడుగులు తవ్వాక ఇంటి యజమాని ఒకరు తమ స్థలంలో బోరు వేస్తున్నారని ఫిర్యాదు చేయటంతో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో అక్కడి మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని పోలీసులు నచ్చజెప్పారు.





జనం కోసం ధైర్యంగా నిలిచిన అల్లాభక్షు

వర్ధంతి సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సిద్ధాంతం కోసం అల్లాబక్షు అంకితభావంతో నిజాయితీగా నిలవటమే కాకుండా, క్లిష్ట సమయాలలో పార్టీ కోసం, ప్రజలకోసం ముందు నిలిచి ధైర్య, సాహసాలు ప్రదర్శించారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో సీనియర్ నాయకులు అల్లాబక్షు 8వ వర్ధంతిని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సభకు నాయకులు వి.తులసీరామ్ అధ్యక్షత వహించగా విజయకుమార్ మాట్లాడుతూ తన చుట్టూ ఉన్న వారు అభ్యున్నతి కోరుకొని, సమాజం మార్పు కోసం నిలవటం మాటల్లో చెప్పేంత తేలికైన విషయం కాదన్నారు. రైతు సంఘం నాయకునిగా, సిపిఎం సత్తెనపల్లి డివిజన్ నాయకులుగా అల్లాభక్షు తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని చెప్పారు. ప్రజలతో మమేకం కావడంతోపాటు పార్టీ నిర్మాణంలో కీలకంగా నిలిచారని చెప్పారు. పేదల కోసం జరిగిన అనేక పోరాటాల్లో ముందు పీఠిన ఉన్నారన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ గ్రామంలో జరిగిన ఇళ్ల స్థలాల పోరాటంలో, రోడ్ల నిర్మాణం, రైతు సమస్యలను పరిష్కరించడంలోనూ అల్లాక్షు ముందుండేవారని, రైతు నాటిక తనే స్వయంగా రచించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏడాదిలో 100కు పైగా ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. తన కుటుంబం మొత్తాన్ని పార్టీలో నిలిపారన్నారు. ఆయన ఆశయాలు సాధనకోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు ఆర్.పూర్ణచంద్రరావు, ఎం.నరసింహారావు, డి.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్నా, ఎ.వీరబ్రహ్మం, కె.శివదుర్గారావు, ఎం.హరిపోతురాజు, జె.రాజ్‌కుమార్, ఆర్.పురుషోత్తం, అనూష, వెంకట్ నారాయణ, వెంకయ్య పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో సెల్ ఫోన్ వాడకూడదు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : పెట్రోల్ బంకుల్లో సెల్‌ఫోన్లు ఆన్ చేయొద్దని వాటితో అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని సత్తెనపల్లి అగ్నిమాపవు శాఖ అధికారి ఎంవి సుబ్బారావు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై సత్తెనపల్లి పట్టణంలోని హేమకేష్‌రామ్ పెట్రోల్ బంక్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. వేసవిలో పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అత్యంత జాగ్రత్తతో



వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ యజమాని డి.పూర్ణచంద్రరావవు, సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ షేక్ గౌస్, డ్రైవర్ ఆపరేటర్ డి.విజయభాస్కర్‌రెడ్డి ఫైర్‌మాన్లు వై.మహేంద్రరెడ్డి, ఎన్.రమణ నాయక్, పి.గోవిందు, బి.నాగేశ్వరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

వాడవాడలా మేడే కార్యక్రమాన్ని నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో మే ఒకటో తేదీన జరిగే మేడే కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. సిపిఎం పట్టణ కమిటీ సమావేశం సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అధ్యక్షతన శుక్రవారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరిగింది. రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఎన్నో సంవత్స రాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరించే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. కార్మికులు ఐక్యంగా ఉండి మోడీ విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ వేసవి కాలంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా పట్టణ ప్రజలకు తాగునీరు కార్పొరేషన్ అందించాలని అన్నారు. తాగునీరు అందని ప్రాంతాలలో అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని అన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, పట్టణ కమిటీ సభ్యులు ఎం.నాగేశ్వరావు, శ్రీరాములు, జె.బ్రాహ్మణి, కె.శ్రీనివాస రావు, ఎం.చంద్రారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు

12వ రోజుకు చేరిన క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె శుక్రవారం నాటికి పన్నెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు డి.శివ మాట్లాడుతూ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నెలకు 12,500 రూపాయలు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, 24 వేల ఐదువందల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. 16 నెలలుగా ఈఎస్ఐ, వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ఐడి కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. ఆప్కాస్‌లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె 12 రోజులుగా జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించు కోవడంలేదని విమర్శించారు. అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్ స్పందించడం లేదని విమర్శించారు. ఇదేవిధంగా సమ్మె కొనసాగితే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి ఎం.రవి, యూనియన్ నాయకులు ఎం.యోహన్, జె.శ్రీకాంత్, ఆర్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు







నృత్యప్రదర్శనల్లో విద్యార్థులు

ప్రతి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రతి తల్లిదండ్రులు ప్లిలలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సైన్స్ ఉపాధ్యాయులు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గనికపుడి ఉర్దూ పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మహమ్మద్ మహబూదా, టిడిపి నాయకులు సుబ్బయ్య, షేక్ బాబు పాల్గొన్నారు. నక్క వెంకటేశ్వర్లు మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అర్థమవుతోందని, ఇటువంటి ఉపాధ్యాయులకు సహకరిస్తే పిల్లలను చక్కగా తీర్చిదిద్దుతారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీడీపీ నాయకులు సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత యూనిఫాం, సాక్స్, బ్యాగ్, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. యుటిఎఫ్ నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎం.డి.షకీల బేగం, పాఠశాల ఉపాధ్యాయురాలు ఫాతిమాబి తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యాయులు ఎం. హనుమంతరావు, ఎం.కళాధర్, యు.రాజశేఖర్, వెంకటేశ్వర్లు, పి.ప్రేమ్‌కుమార్, రవికుమార్, వేణుగోపాల్, వి.మరియరాజు, నరసింహారావులు పాల్గొన్నారు.



మంగళగిరి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వానపల్లి బ్రహ్మనాయుడు, ప్రధాన కార్యదర్శిగా బందెల దయాకర్, కోశాధికారిగా బత్తుల సాంబశివరావు, గౌరవాధ్యక్షులుగా కూరపాటి మురళి రాజు, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, మట్టుకొయ్య కృష్ణ, బాపనపల్లి శ్రీనివాసరావు, లను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నువ్వుల శ్రీహరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.మల్లేశ్వరరావు, కార్యదర్శులుగా దొప్పలపూడి రాము, మెడకాయల మస్తాన్, మంచికలపూడి సిరిబాబు, సహాయ కార్యదర్శులుగా చదలవాడ సాయిచంద్, నాయుడు నాగరాజు, గండికోట దుర్గారావు లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా శిరందాసు విజయ భాస్కర్ ,విడేల సాయి శ్రీనివాస్, కె.అభిరామ్ కలఅష్ణారెడ్డి, ఎం శివనాగిరెడ్డి, బత్తెన శ్రీనివాసరావు, ఆరేపల్లి రాజు, వేముల రాంబాబు, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, మద్దెల కిషోర్, ఉద్దంటి రమేష్, పి.రమేష్ కె.వెంకటేష్, శివరాత్రి శ్రీనివాసరావు, బండారు సాంబ,జీవై సాయి కృష్ణ, చిన్ని కాజాలను ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులుగా కొలికిపూడి రూఫస్, శిరందాసు నాగార్జున, త్రిపురమల్లు సతీష్, ఎన్వి శివన్నారాయణ, గోరంట్ల లక్ష్మీనారాయణ, శిరందాసు శ్రీనివాసరావు, ఈపూరి రాజారత్నం, ఐ.వెంకటేశ్వరరెడ్డి, అన్నవరపు ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.





136 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 136 రోజులకు చేరుకున్నాయి. దీక్షలో టి.దుర్గా భవాని, వై.రమాదేవి, ఎం.శారద, ఎస్.కె.హిమాంబి, డి.రమణ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎందుకు వెనకడిగేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్. రాయల్, ఎస్.కె. బాషా, వై.సుబ్బారావు, కె అగ్గయ్య, టి నాగేశ్వరరావు, వి వెంకటేశ్వరరావు, కె.అంకమ్మ, ఏడుకొండలు, ఈ శారమ్మ, బి. సూర్యప్రకాశరావు, వై.సాంబయ్య, ఎం.గురవయ్య పాల్గొన్నారు.



తుంగభద్ర కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

తాగునీటి చెరువులకు నీరు విడుదల

ప్రజాశక్తి - దుగ్గిరాల

తెనాలి డివిజన్ జల వనరుల శాఖ పరిధిలో ఉన్న త్రాగునీటి చెరువులకు నీటిని విడుదల చేశారు. శుక్రవారం వరకు 500 క్యూసెక్కులు విడుదల చేయగా మరో 500 క్యూసెక్కులు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని జలవన రుల శాఖ ఏఈ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నీటిని తుంగభద్ర (కొమ్మమూరు) కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. త్రాగునీటి చెరువులు నిండే వరకు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. డెల్టా పరిధిలోని అన్ని త్రాగునీటి చెరువులు నిప్పుకోవాల్సిందిగా ఆయన కోరారు.



సంక్షేమ బోర్డును కొనసాగించాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

కార్మికుల శ్రేయసే లక్ష్యంగా సుదీర్ఘకాలం పోరాటం అనంతరం భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డును ప్రభుత్వం కొనసాగించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ గౌరవ అధ్యక్షులు సిహెచ్ భుజంగరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మహానాడు భక్తులు రాజుభవన్లో బి చంద్రశేఖర్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణ పనుల్లో స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దాంట్లో భాగంగా మంత్రి నారా లోకేష్ ను కలవడానికి వెళ్లాలని నిర్ణయించారు. నిర్మాణ కార్మికుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) ను బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి, వెంకటేశ్వర్లు, సుధాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కేశవరెడ్డి

ఎమ్మెల్యే జూలకంటి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మాచర్ల పట్టణంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు నడుమ ఘనంగా జరిగాయి. ముందుగా ఎమ్మెల్యే శ్రీశైలం రోడ్డు నుండి అభిమానులు ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో నిమ్మకాలు, వివిధ రకాల పూలతో చేసిన భారీ గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలి కారు. వడ్డె ఓబన్న విగ్రహం వద్ద గుమ్మడి కాయలతో, మాచర్ల పార్క్ సెంటర్ వద్ద వివిధ రకాల పూలతో, బస్టాండ్ సెంటర్ వద్ద చెరుకు గడలతో నెహ్రూనగర్ బోటుమీద బత్తాయి పండ్లతో ఏర్పాటు చేసిన భారీ గజమాలలతో ఎమ్మెల్యే జూల కంటికి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికీ ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలిపారు.వేడుకలను నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, శ్రేణులు పర్యవేక్షించారు.

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల కేంద్రంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన్నాన్ని పురష్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. గురు వారం రాత్రి పొద్దుపోయిన తరువాత పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ కేకులను కట్ చేసి జూలకంటికి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో మాచర్ల నియోజవర్గస్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు గ్రామానికి చెందిన ముత్తవరపు కోకిల మారుతి అనారోగ్యంతో బాధపడుతున్నారు. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముందస్తు చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 60వేలను అందజేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాసు మహేష్‌రెడ్డి

పారదర్శకత లోపిస్తున్న కూటమి పాలన

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి పాలనలో పారదర్శకత లోపిస్తుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. నరసరావుపేటలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల దేవస్థానం పవిత్రతకు భంగం కలిగించే ఘటనలు చోటుచేసుకుని భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయన్నారు. టిటిడి గోశాలలో నెలకి 10-15 చొప్పున 150-170 గోవులు చనిపోయాయని వైసిపి నేత కరుణాకర్ రెడ్డి చెప్పడం ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. గోవులది సహజ మరణం కాదన్నారు. దీనిపై ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం తక్షణమే స్పందించి, విచారణ జరిపించాలన్నారు. గోవు కూడా నిర్లక్ష్యం వల్ల చనిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ మహిళలు



అమరావతిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పల్నాడులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసురు గ్రామంలో లూథరన్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించబడే కార్యక్రమానికి స్థానిక పాస్టర్ సుందరరావు అధ్యక్షత వహించారు. ఈ ప్రార్ధనలో పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువలో మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా తెలిపారు యేసు సిలువ మీద పలికిన ఏడు మాటల గురించి ఏడు గురు విశ్వాసులు బోధించారు. పాస్టర్ మాట్లాడుతూ యేసు సిలువ మరణం ఈ లోక ప్రజలను విమోచించింది అని క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలలో ప్రేమదయ క్షమాపణ జాలి కరుణను గురించి బోధిస్తుంది అని తెలి పారు. ప్రార్దనల అనంతరం క్రీస్తు కార్చిన రక్తమును సాదృ శ్యంగా ద్రాక్షారసం, పానకం విశ్వాసులకు అందించారు. కార్యక్రమంలో సంఘపెద్దలు స్త్రీలు విశ్వాసులు వందలాది మంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండలం లేమల్లె గ్రామంలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ప్రార్ధనల్లో ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే పవిత్ర దినం ప్రభువైన యేసు క్రీస్తు చేసిన త్యాగాన్ని గుర్తు చేస్తుందన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుడ్ ఫ్రైడే సందర్భంగా తెలుగు బాప్టిస్ట్ సంఘం టౌన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన శిలువధారి యాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చదలవాడ స్థానిక క్రిస్టియన్ పాలెం నుంచి టౌన్ చర్చి వరకు శిలువలను మోశారు. అనంతరం మాట్లాడుతూ జీసస్ ప్రభువు ప్రపంచంలో ప్రేమను, శాంతి, కరుణను నింపేందుకు వచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ జీసస్ బాటలో నడిచి ప్రేమ కరుణతో జీవించాలని కోరారు. శిలువదారి యాత్రలోక్రైస్తవ సోదరి సోదరులు, కూటమి నాయ కులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వచ్చే ఏడాది వరికపూడిసెల పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల :

వచ్చే ఏడాదిలో వరికపూడిసెలను పూర్తి చేస్తామని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే జూలకంటి జన్మదినం సందర్భంగా నెహ్రూనగర్ బోటు మీద వివిఎన్ గార్డెన్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా సర్వనాశనం చేసి, వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యా సం చేస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి ఎప్పుడు రాజకీయ సన్యాసం చేస్తావని ఎమ్మెల్యే ప్రశ్నిం చారు. మాచర్ల నియోజకవర్గానికి ఏం చేశావ్ పిన్నెల్లి అని నిలదీశారు. కూటమి ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీ ప్రజలు సుపరి పాలన చూస్తున్నారని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఉద్ఘాటించారు. మాచర్ల నియోజకవర్గాన్ని అత్యంత ప్రాముఖ్యమైన నియోజకవర్గంలా తీసుకుని, అభివృద్ధి చేస్తానని ఆనాడు చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 800 కోట్ల పైచిలుకు నిధులు తాగు నీటికి కేటాయించగా, రహదారులకు, మౌళిక వసతులకు పెద్దఎత్తున నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. కేంద్రీయ విద్యాలయానికి రూ. 25 కోట్లు, సాగర్‌లో టూరిజం అభివృద్ధికి రూ. 25 కోట్లు, అమృత స్కీం కింద రూ.100 కోట్లు, సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద రోడ్లకు రూ.115 కోట్లు వంటివి ఎన్నో నిధులు మాచర్లకు కూట మి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. వేడుకల్లో మాచర్ల నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి



అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆపత్కాల సమయంలో ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా సహాయక బృందాలు వచ్చేలోగా తమను తాము రక్షించుకోవడం ఎలాగో ప్రజలు తెలుసుకోవాలని నరసరావుపేట అగ్నిమాపక కేంద్రం అధికారి ఎంవి సుబ్బారావు అన్నారు. శుక్రవారం నరసరావుపేట మండలం చిన్నతురకపాలెం గ్రామ పంచా యతీ పరిధిలోని మిట్టపల్లి స్పిన్నింగ్ మిల్ ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడం ఆసు పత్రులకు తరలిం చడం, అగ్ని ప్రమాద సమయాల్లో చేపట్టే సహాయక చర్యలు తదితర అంశాలను వివరించారు.

ప్రజాశక్తి - యడ్లపాడు : అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా అయి దవ రోజు సందర్భంగా చిలకలూరిపేట అగ్నిమాపక అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యములో శుక్రవారం కొండవీడులోని జిందాల్ పవర్ ప్లాంట్‌లో యాజమాన్యా నికి, సిబ్బందికి కరపత్రాల పంపిణీ, ఫైర్ మాక్‌డ్రిల్ నిర్వ హించారు. కార్య క్రమంలో మాణిక్యరావు లీడింగ్ ఫైర్ మాన్, వెంకయ్య లీడింగ్ ఫైర్‌మాన్, పవన్ కుమార్, రాజు, కరీముల్లా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : కూటమి ప్రభుత్వం అధికా రం లోకి రాగానే రాష్ట్రంలో మోకాల్లోతు గోతులను పూడ్చేందుకు నిధులు కేటాయించి మరమ్మత్తులు పూర్తి చేసిందని గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి మౌళిక సదుపాయాల కల్పనకు తమ ప్రభు త్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరస రావుపేట మండలం రెండో వారం పల్లెనిద్రలో కార్య క్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అరవపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహి రంగ సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి కుంటు పడిం దన్నా రు. పంటల కాల్వల మరమ్మతులు చేపట్టక పోవడంతో చివరి భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకిరాగానే పంటకాల్వల మరమ్మతులు చేపట్టిందన్నారు.

21న ఆదర్శ పాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 2025 -26 విద్యా సంవత్సరం ఆరవ తరగతి ప్రవేశ 221 విద్యార్థులు నమోదు చేసుకోవడం రొంపిచర్ల మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ బి రవి నాయక్ తెలిపారు. 21వ తేదీన జరిగే ప్రవేశ పరీక్షల్లో 221 మంది విద్యార్థులు హాజరవుతారని అయితే 100 మందికి మాత్రమే అవకాశం ఉందని, వంద మందికి 221 మంది విద్యార్థులు దరఖాస్తులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్ష ఈనెల 21 ఉదయం 10 గంటలకు మొదలవు తుందని. పరీక్ష సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రంలో ఉండాలన్నారు. హాల్ టికెట్ సంబంధిత వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

నేడు కరెంటు కోత

ప్రజాశక్తి - క్రోసూరు : విద్యుత్ శాఖ చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా క్రోసూరు మండల పరిధిలోని క్రోసూరు, దొడ్లేరు, ఊటుకూరు గ్రామాల్లో శనివారం విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు క్రోసూరు విద్యుత్ ఏ.బసవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

వాడవాడలా గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు







ఫిరంగిపురం, తాడేపల్లి, మంగళగిరిలో జరిగిన గుడ్‌ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

క్రీస్తు సిలువ మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటూ, శుక్రవారం మంగళగిరి సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాలులో ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం జరిగాయి. క్రీస్తు మరణానికి ముందు పలికిన ఏడు మాటలుపై ధ్యానం నిర్వహించారు.. వాక్య సందేశకులుగా రెవరెండ్ జోసెఫ్ కొదమల, నేలపాటి డేవిడ్, కే. రూఫస్, ఎం. సుజాత, కే. కవిత ఉన్నారు. క్రీస్తు మార్గం ద్వారానే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందని అన్నారు..

ప్రజాశక్తి - తాడేపల్లి

నులకపేటలోని ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఆర్‌సిఎం సంఘస్తులు ఏసుక్రీస్తు మరణానికి సంబంధించి ఘట్టాలు స్లీవా మార్గం ద్వారా నాటక ప్రదర్శన ప్రదర్శించారు. ప్రకాష్ నగర్‌లోని ఆర్‌సిఎం దేవాలయం నుండి అన్నమ దేవాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ దాసయ్య, పాపయ్య, సిస్టర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

గుడ్ ఫ్రైడే పండుగను క్రైస్తవ సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. మతగురువు లు బైబిల్ పఠనం చేసి పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా ఊరేగింపులు నిర్వహించారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం బాలయేసు కథెడ్రల్ దేవాలయంలో పవిత్ర గురువారం దివ్యబలి పూజ నిర్వహించ బడింది. ప్రధాన యాజకులు అయినటువంటి ఫాదర్ తుమ్మ కరుణాకర్ రెడ్డి గారు ప్రసంగిస్తూ గురుత్వ అంతస్తు స్థాపన, దివ్యసప్రసాద స్థాపన, ప్రథమ ఆజ్ఞ అయినటువంటి ప్రేమ గురించి లోతైన అర్ధాలతో మరియు భావాలతో వివరణాత్మకంగా ప్రసంగించారు. ఈ పరిశుద్ధ దివ్యబలి పూజలో పాల్గొన్న ప్రియతమ విచారణ గురువు అయినటువంటి రెవ.ఫాదర్ మాలపాటి ఫాతిమా రెడ్డి, సహాయ గురువులు అయినటువంటి ప్రవీణ్, రవీంద్ర, ఫాదర్ భరత్‌రెడ్డి,

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణంలో పలు ప్రార్థన మందిరాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు క్రీస్తు కృపాలయం సెంటినరీ లూథరన్ చర్చి, హయ్యర్ పెట్ ప్రార్థన మందిరాల్లో మూడు గంటలు వరకూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ డాక్టర్ వేముల సర్వోన్నతరావు అధ్యక్షతన క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను పలువురు దైవ సేవకులు వివరించారు. అనంతరం సాయంత్రం నాలుగున్నర గంటలకు ఐతానగర్ క్రీస్తు కఅపాలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు క్రీస్తు సిలువ ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గున్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ సుధీర్ కుమార్ పాస్టర్ కే అబ్రహం డిసికల్నల్ థామస్ సాల్వేషన్ ఆర్మీ పాస్టర్ నాగరాజు పాస్టర్ డేవిడ్ న్యాయవాది పిల్లి విద్యాసాగర్ గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో క్రీస్తు కృపాలయం సెంటినరి చర్చి నిర్వాహకులు బొనిగల ప్రదీన్, నేలటూరి సునీల్ బాబు, గెడ్డటి ప్రకాష్ బాబు పాల్గొన్నారు.





చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రజకచెరువు కూడలిలో రజక వాలంటీర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.లక్ష్మీపతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పోతార్లంక ప్రసాద్, పెటేటి శ్రీనివాస్, పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం పినపాడు రోడ్డులోని ఎల్బీనగర్ లో గ్రీన్ లీప్ డెవలపింగ్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కల పెంపకం అనివార్యమని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మురళీకఅష్ణ , ట్రెజరర్ రమేష్ కుమార్ జైన్, డెవలపర్, నల్లజాల లోకేష్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ఈదర వెంకట పూర్ణ చంద్, కన్నెగంటి మురళీకఅష్ణ, చేతన్ రాజు కొఠారి, నల్లూరి వెంకటేశ్వరరావు, దర్శి జీవన్ లత, గుమ్మడి ప్రసాద్, జి.వెంకటనారాయణ, పావులూరి రాంబాబు, డాక్టర్ రాకేష్, వి.హరిప్రసాద్, గిరీష్, కె.ప్రవీణ్, ఎ.కిరణ్ చౌదరి, కిట్స్, జెట్టి సుధీర్, కిషోర్ పాల్గొన్నారు.

రైతుల భూమిని అడ్డంపెట్టి ప్రభుత్వం వ్యాపారం చేస్తోంది

ప్రజాశక్తి - తాడికొండ



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

రైతుల భూమిని అడ్డంపెట్టి ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత భూ సమీకరణకు వెళుతున్న నేపథ్యంలో ఎకరా కోటి రూపాయలు రైతులకు చెల్లించాలని కోరారు. 2014-2019 మధ్య టిడిపి ప్రభుత్వం రైతుల వద్ద నుండి 36వేల ఎకరాలను భూ సమీకరణ కింద తీసుకొందని గుర్తు చేశారు. 2019లో వైసిపి అధికారంలోకి రావటంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. 2024లో అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ మరల భూ సమీకరణకు సిద్ధమైందని అన్నారు. .ప్రభుత్వ అసమర్ధ నిర్ణయాల వల్ల భూమిని నమ్ముకొని ఉన్న రైతు నష్టపోతున్నాడని వాపోయారు. రైతు భూమిని అడ్డం పెట్టుకొని ప్రభుత్వం వ్యాపారం చేస్తుందని ధ్వజమెత్తారు. ఏ.ఆర్.ఎస్. పార్టీ రైతులు పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టిడిపి నాయకులు అందజేశారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన సాదం వెంకయ్యమ్మకి రూ.60వేల చెక్కును, మోపర్తి నాగేశ్వరావు కు రూ. 37,878ల చెక్కును, మొత్తం రూ. 97,878ల రూపాయలను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారధి, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్,రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, జాలాది సందీప్, చిట్టి బమ్మ వెంకటేశ్వరావు, వెంకటేష్, బొర్రా శ్రీకాంత్, గడ్డిపాటి సాంబశివరావు, కంచర్ల బద్రి, షేక్ బాజీ, బుర్ర ధనరాజ్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచేందుకే ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి



విద్యార్థులు నైపుణ్యత పెంచుకునేందుకు ఎస్‌ఏపిఎస్‌డి శిక్షణ తరగతులు దోహపడతాయని మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వంగర సురేష్ అన్నారు. మానవ సేవ సంస్థ ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కొండలరావు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వంగర సురేష్ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారు, వివిధ రంగాల్లో ఉన్న నిపుణులు ఈ కోర్సులు నేర్చుకు నేందుకు అర్హులని తెలిపారు. వారానికి రెండు రోజులు మూడు నెలల పాటు ఈ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కొండలరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలోని విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యాలు పెంచుకున్న వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఉద్యోగాలు పొందేందుకు తగిన మార్గదర్శకాన్ని తమ సంస్థ ద్వారా అందిస్తామని తెలిపారు.



బళ్లారి రాఘవ కృషి మరువలేనిది

ప్రజాశక్తి - తెనాలి

నాటకరంగానికి విశేష కృషి చేసిన మహనీ యుడు బళ్ళారి రాఘవ అని ఇస్కస్ నాయకురాలు శ్రీదేవి చెప్పారు. స్థానిక గాంధీ నగర్‌లోని ఇస్కస్ కార్యాల యంలో శుక్రవారం పట్టణానికి చెందిన అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో బళ్ళారి రాఘవ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బల్లి ముంత కఅష్ణ మాట్లాడుతూ ఆధునిక నాటక రంగానికి సంపూర్ణత్వాన్ని ఆపాదించి వెలుగులద్దిన ఘనత రాఘవ దేనన్నారు. సభలో పలువురు సాహితీ ప్రియులు కళాకారులు పాల్గొన్నారు.

బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా బండి పవన్ కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ వైస్ ప్రెసిడెంట్ గా పివిఆర్ గ్రూప్ అధినేత బండి పవన్ కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, చాగంటి హేమంత్ రెడ్డి బండి పవన్ కుమార్ ను కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాజా వెంకటేశ్వరరావు మాట్లాడారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా పవన్ కుమార్ ఎంపికవడం అభినందించదగ్గ విషయమని అన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై బ్రహ్మయ్య

'మహిళా మీకోసం' యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి : మహిళా సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన 'మహిళా మీకోసం' యాప్‌పై పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్సై ఎం.బ్రహ్మయ్య శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో అవగాహన కల్పించారు. మొబైల్లో యాప్‌ను డౌన్లోడ్ చేసుకునే విధానం, దానిని ఉపయోగించి సమస్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసే పద్ధతిని వివరించారు. పేకాట, వ్యభిచారం, గంజాయి సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే ఆ సమాచారాన్ని పోలీసులకు అందించవచ్చునని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని చెప్పారు. ఇటీవల పట్టణంలో రాత్రి సమయంలో మహిళ ఇబ్బంది పడుతూ 112కు సమాచారం ఇస్తే వెంటనే స్పందించి ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చిన సందర్భాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మహిళా కానిస్టేబుల్ జె.కళ్యాణి పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - తెనాలి : వచ్చే నెల 10, 11 తేదీలలో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు పట్టణానికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావు, రంగస్థల కళాకారులు, రచయితలు దేవిశెట్టి కఅష్ణారావు, చందు సూర్య, వినుకొండ శ్రీరామమూర్తి, కొప్పరాజు విజయ సారథి బాబుకు శుక్రవారం ఆహ్వానం అందినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థ ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

24న డీఎస్సీ పరీక్షలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

పోటీ పరీక్షలకు నాలుగున్నర దశాబ్దాల అనుభవం గడించిన కాంపిటీషన్ సక్సెస్ కాలేజ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భర్తీ చేయబోతున్న 16,347 ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి 'డీఎస్సీ పరీక్ష' ప్రిపరేషన్‌పై ఈనెల 24న ఉదయం 10 గంటలకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఎస్‌సి డైరెక్టర్ టి.ఎస్.రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బ్రాడీపేట 2/11 కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ సమావేశ మందిరంలో జరిగే ఈఅవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త కె.ఎస్.లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని, సిలబస్, ప్రిపరేషన్, మొదలు అంశాలపై టిప్స్, అందిస్తూ అవగాహన కల్పిస్తారని చెప్పారు. లక్ష్మణరావుతో పాటు నిష్ణాతులైన అధ్యాపక బందం కోటేశ్వరరావు, వెంకట్, సురేష్ మొదలగువారు పాల్గొంటారన్నారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని డైరెక్టర్ రామన్ కోరారు.



శంకరరావును అభినందిస్తున్న లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు

ఆటోడ్రైవర్‌కు ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్

ఇంటర్నేషనల్ ట్రేడ్ అంశంపై పరిశోధన - పలువురు అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

ఏ వృత్తిలో ఉన్నా, ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా పట్టుదల ఉంటే ఎంత వరకైనా చదువుకోవచ్చని ఆటో డ్రైవర్ నిరూపించాడు. గుంటూరు నగరానికి చెందిన గండికోట శంకరరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కాలికట్ యూనివర్సిటీ నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య శంకరరావును దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ గండికోట శంకర్రావు ఆటో డ్రైవర్‌గాను, డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గుంటూరు నగర ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారన్నారు. పని చేసుకుంటూ ఎకనామిక్స్‌లో ఇంటర్నేషనల్ ట్రేడ్ అంశంపై పరిశోధన చేయటం అభినందనీయం అన్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక, స్వయంగా ఉపాధితో జీవిస్తూ, చదువుపై ఉన్న ఆసక్తితో డాక్టరేట్ చేయటం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచీకరణలో ఇంటర్నేషనల్ ట్రేడ్ ప్రధానమైన అంశంగా ముందుకు వస్తున్నటువంటి నేపథ్యంలో ఇటువంటి కీలకమైన, కష్టమైన అంశంపై పరిశోధన చేయటం అభినందనీయం అన్నారు. శంకరరావును అభినందించిన వారిలో రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, నాయకులు జి.శ్రీనివాసులు, కే సురేష్, ఎం.పోలి నాయుడు, కే నాగేశ్వరరావు, బి లక్ష్మణరావు, షేక్ మస్తాన్ వలి, ఎం రాజా, ఎం.వెంకటేశ్వర్లు, రాంబాబు, మహేష్ ఉన్నారు.

ముగిసిన వైఎస్ఆర్ కళా పరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రామలింగేశ్వరపేట ఓపెన్ ఆడిటోరియంలో ఈనెల 12 నుంచి ప్రారంభమైన వైఎస్సార్ కళాపరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. చివర రోజు ప్రదర్శనలలో భాగంగా గుంటూరు అభినయ ఆర్ట్స్ వారు 'ఇది అతని సంతకం' నాటికను ప్రదర్శించారు. ప్రతి మనిషికి జీవితంలో ఒక లక్ష్యం, వ్యక్తిత్వం ఉంటుంది. ఎవరు ఏమనుకున్నా తనదైన శైలిలో జీవన విధానాన్ని కొనసాగించేందుకు కృష్ణమూర్తి ఇష్టపడతారు. దానికోసం ఎక్కడ రాజీలేని జీవితాన్ని కొనసాగిస్తాడు. జీవిత చరమాంకంలో సైతం ఇంటా బయటా తన వ్యక్తిత్వంతో నెగ్గుకొచ్చిన స్వభావమే నాటిక సారాంశం.



ఇది అతని సంతకం నాటికలో సన్నివేశం



దేవుడు కనిపించాడు నాటికలో దశ్యం

స్నిగ్ధ రచనకు, రవీంద్ర రెడ్డి దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా కాకినాడ సాయి కార్తీక్ క్రియేషన్స్ ప్రదర్శించిన 'దేవుడు కనిపించాడు' నాటిక తల్లి కొడుకుల అనుబంధానికి అద్దం పట్టింది. కొడుకు తాను చనిపోతానని తెలిసి కూడా తన తల్లికి ఆసరాగా నిలబడాలి అనే తపన, ఆపరేషన్ చేస్తే తన ప్రాణానికి ప్రమాదం అని తెలిసి కూడా కొడుకును బతికించుకునేందుకు కిడ్నీ దానం చేసిన తల్లి త్యాగం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఎవరు విడదీయలేని పేగు బంధానికి ప్రతీకగా నాటిక నిలిచింది. పాత్రలో లీనమై తల్లి కొడుకుల పాత్రలకు నటినటులు జీవం పోశారు. డాక్టర్ సింహప్రసాద్ మూల కథకు నాటకీకరణ మార్కొండ దుర్గాప్రసాద్, దర్శకత్వం చత్రవిజయలక్ష్మి మహేష్ నిర్వహించారు. తెనాలి కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షులు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, కార్యదర్శి పి వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయకపోతే పోరాటం ఉధృతం

తెనాలిలో నల్ల జెండాలతో భారీ నిరసన ర్యాలీ - సంఘీభావం తెలిపిన పలు పార్టీలు



తెనాలిలో భారీ నిరసన ర్యాలీలో ముస్లిం సంఘాలు, రాజకీయపారీలు,

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలను తిప్పి కొట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం తెనాలి పట్టణంలో మజ్లిసిల్ ఉలమా హవల్, అయిమ్మా జమీయతే ఉలమా హింద్ - తెనాలి ఆధ్వర్య ంలో పలు రాజకీయ పార్టీలు, లౌకిక వాదులు దళిత, ప్రజా సంఘాలతో శుక్రవారం నిరసన శాంతి ర్యాలి నిర్వహించారు. స్థానిక వాహబ్ చౌక్ నుండి ప్రారంభమైన వక్ఫ్ వ్యతిరేక శాంతి ర్యాలీ బోస్ రోడ్డు, గాంధీ చౌక్ మీదుగా నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించి శివాజి చౌక్ కూడలిలో నిరసన తెలిపారు.ఇస్లాం ధర్మంలో ముస్లిం సమాజ ప్రయోజనాలకు 'వక్ఫ్' విరాళాలను సేకరిస్తుందని ముస్లిం మత గురువులు వివరించారు. వక్ఫ్ సవరణ చట్టం ముస్లింలకు వ్యతిరేకంగా ఉందని, వక్ఫ్ వ్యతిరేంక చట్టానికి మద్దతుగా క్రైస్తవులు, హిందు వులు మద్దతు పలకడం ముదావహ మన్నారు. సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ విధా నాలను తిప్పికొట్టాలన్నారు. మనువాద రాజ్యాంగాన్ని అమలుకు కుట్ర చేస్తున్న బిజెపి పతనమయ్యే రోజులు ఆసన్నమయ్యాయని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై కన్నేసిన బిజెపి క్రైస్తవుల ఆస్తులు కూడా కూడగట్టే ప్రయత్నాలు చేస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు మైనార్టీలకు మద్దతుగా అన్ని మతాలు కలిసికట్టుగా మద్దతు తెలపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్రప్రభుత్వంపై ఏక స్వరంతో వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశం యొక్క లౌకికవాదాన్ని, మతసామరస్యాన్ని కాపాడు కోవాలని అన్నారు. క్రైస్తవ, ముస్లిం మైనారిటీలకు హిందువులు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. మతతత్వపు పార్టీలతో ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీలో వారి రహస్య అజెండాలతో అశాంతి నెలకొల్పే విధంగా ఇటువంటి వ్యతిరేక బిల్లులను ప్రవేశ పెడుతున్నారని ప్రముఖ దైవసేవకులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం కలసి కట్టిగా పోరాటం చేయబట్టి ఎన్ఆర్సి బిల్లు వెనక్కిళ్లిందని క్రైస్తవులు ఉద్ఘాటించారు. పట్టణంలో పలు ముస్లిం మైనారిటీ సంఘాలు, క్రైస్తవులు, దళిత ప్రజా సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక కథనాలను చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.



తెనాలిలో ప్రజాశక్తి ప్రచురించిన వక్ఫ్ ప్రత్యేక సంచికలు ఆవిష్కరిస్తున్న ముస్లిములు

ఆర్‌పిలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - గుంటూరు

ఆర్‌పిలకు కనిసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, బలవంతపు కొనుగోళ్లు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియార్టీ, అర్హత ఉన్నవారికి సీఈవో ప్రమోట్ చేయాలని మెప్మా ఆర్పీల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో జరిగిన ఆర్పీల సంఘం జిల్లా విస్తఅత సమావేశంలో ధనలక్ష్మి మాట్లాడుతూ ఆర్పీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీడీ చెప్పారనే పేరుతో సీఈఓ, సీఎంఎంలు అవసరం లేని సరుకులను, ఆదనపు రేట్లతో కొనుగోలు చేయాలని వేధించడం మానుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ వ్యాపారం చేస్తున్నారో చెప్పాలని అధికారులను డిమాండ్ చేశారు. లాగిన్లు ఇవ్వకుండా ఆర్పీలతో ఎలా పని చేయిస్తారని ప్రశ్నించారు. ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆర్ పి లు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మిక, ఉద్యోగుల హక్కులను అందించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆర్పీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్‌పి గుంటూరు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా స్వాతి, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా అంకమ్మ, ఉపాధ్యక్షులుగా రమణ, బషీరా, సహాయ కార్యదర్శులుగా గుల్జార్, గౌస్య, గౌరవాధ్యక్షులుగా దండా లక్ష్మీనారాయణను ఎన్నికయ్యారు.




మాట్లాడుతున్న ధనలక్ష్మి

బాల్యంలో ఒత్తిడి లేని విద్యను అందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జ్ఞాన సముపార్జనలో కీలకమైన పఠనానికి పునాదులు పడాల్సిన బాల్యంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణం పెద్ద చెరువులోని బెస్ట్ ఇంగ్లీష్ మీడియం 37వ వార్షికోత్సవ సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల్యం నుండి పుస్తకాలు చదివించడం ద్వారా సమాజం పై అవగాహన పెరుగుతుందని ఆ దిశగా స్కూల్ యాజమాన్యం చొరవ చూపాలన్నారు. పిల్లలకు కథలతో పాటు చిత్రాలతో కూడిన ఆసక్తికర పుస్తకాలు చదివించాలని తద్వారా పుస్తకాల పట్ల ఆకర్షితులవుతారన్నారు. నరసరావుపేట డిఎస్.పి కె.నాగేశ్వరరావు, విద్యావేత్త ఏలూరి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ చిన్నారుల ఇష్టానికి తగినట్లుగా పుస్తకాలు ఎంపిక చేసి చదివేలా ప్రోత్సహించాలని విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉత్తమ పౌరులుగా ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పుస్తక పఠనం మానసిక ఒత్తిడి తగ్గిస్తుందన్నారు. కథల పుస్తకాలు పిల్లల్లో ఏకాగ్రత, సజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. చూడటం కన్నా చదవడం వల్ల మంచి అనుభూతి పొందుతారన్నారు. 37 ఏళ్లుగా ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి జీవితానికి ఉన్నత బాటలు వేసిన స్కూల్ యాజమాన్యానికి మరియు అధ్యాపక బందానికి అభినందనలు తెలిపారు. స్కూల్ డైరెక్టర్ మోహన్ రాకేష్,హెచ్.ఎం అరుణ లు మాట్లాడుతూ తమ స్కూల్ చిన్నారులకు అనుభవం కలిగిన అధ్యాపకులచే ఒత్తిడిని విద్యను అందిస్తున్నామన్నారు. 37 ఏళ్లుగా తమను ఆదరిస్తున్న తల్లిదండ్రులకు స్కూల్ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు జ్ఞాపికను బహుకరిస్తున్న స్కూల్ యాజమాన్యం